

- రవాణా శాఖ కార్యాలయాల్లో బ్రోకర్లదే హవా
- ప్రతీ పనికో రేటు
- ఇటీవల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన డీటీవో

పైసలిస్తేనే పని..



జగిత్యాల జిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయం

ఏసీబీకి పట్టుబడిన డీటీవో భద్రునాయక్(ఫైల్)

జగిత్యాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రవాణాశాఖ కార్యాలయాల్లో పైసలు ఇవ్వనిదే పని జరగడం లేదన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కార్యాలయంలో ప్రతీ పనికి ఓ రేటు ఫిక్స్ చేసి మరీ వసూలు చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. కొంత మంది దళారులు ఈ తతంగాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహనాల రిజిస్ట్రేషన్లు, పాఠశాల బస్సుల రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్స్ వంటి పనులకోసం అధికారులు లంచాలు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. తాజాగా కోరుట్లకు చెందిన ఓవ్యక్తి నుంచి కార్యాలయ డ్రైవర్ ద్వారా రూ.22వేల లంచం తీసు కుంటూ జిల్లా రవాణాశాఖ అధికారి భద్రునాయక్‌ను రెడ్‌హ్యాండెండ్‌గా ఏసీబీకి చిక్కడం సంచలనం సృష్టించింది. రవాణా శాఖ కార్యాలయాల్లో అధికారులు, ఉద్యోగులు, కిందిస్థాయి సిబ్బంది అవినీతికి పాల్పడితే నిరోధిం చాల్సిన జిల్లా స్థాయి అధికారి అవినీతి ఉచ్చులో చిక్కుకోవడం చర్చనీ యాంశంగా మారింది.

● బ్రోకర్లకు కోడ్

ఆర్‌టీఏ కార్యాలయంలో ముందు దరఖాస్తు చూడడం లేదని, దరఖాస్తు వెనకాల ఉన్న సంఖ్యను చూస్తారని, ఒక్కో బ్రోకర్‌కు ఒక్కో కోడ్ ఇస్తారని స్థానికులు చెబుతున్నారు. కోడ్ భాషలోనే ఆర్‌టీఏ కార్యాలయంలో మాట్లాడుకుంటారని అంటున్నారు. ప్రతీ ఫైల్‌కు పెన్సిల్‌తో కోడ్ వేస్తారని, దాన్ని బట్టి ఫైల్ భవిష్యత్ ఆధారపడుతుంది. వాళ్ల భాషలో సరియైన కోడ్ అయితే ఆ పని చకచకా అవుతుంది. పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు తమ బస్సుల ఫిట్‌నెస్ కోసం ఆ బ్రోకర్లనే ఆశ్రయిస్తారని స్థానికులు చెబుతున్నారు. ఫిట్‌నెస్ లేని బస్సులతో పాటు ఇతర పత్రాలు లేకుండా బ్రోకర్ల ద్వారా ఆర్‌టీఏకు వస్తే ఆ ఫైల్ ఒకే చేస్తారనే ఆరోపణలున్నాయి. జిల్లాలో ఆర్‌టీఏ కార్యాలయంలో రవాణా శాఖ అధికారుల అక్రమ ఆదాయం రోజుకు కొన్ని వేలల్లో ఉంటుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆఫీస్ పరిసరాల్లో ఏజెంట్ల ద్వారా పనులు చక్కబెడుతున్న అధికారులు వారి స్థాయిని బట్టి వాటాలు పంచుకుంటున్నట్లు సమాచారం.

● అడిగినంత ఇవ్వాల్సిందే..

రవాణాశాఖలో వాహనదారులకు లైసెన్స్‌లు, వాహనాల రిజిస్ట్రేషన్లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ తదితర కార్యకలాపాల కోసం ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉన్నాయి. కానీ ఏజెంట్ల ద్వారా వెళ్తేనే ఎలాంటి పనైనా వెంటనే పూర్తయ్యే అవకాశం ఉంది. ఇందుకోసం ఏజెంట్ అడిగినంత ముట్టజెప్పాల్సిందేనంటున్నారు. వీటికి తోడు వాహనాల ఫిట్‌నెస్, పేర్ల మార్పిడి..

.మిగతా 8లో

జిల్లాలో వాహనాల వివరాలు

అంబులెన్స్‌లు	99
ఆటో రిక్షాలు	5,846
బస్సులు	137
స్కూల్ బస్సులు	480
మోటార్ క్యాబ్స్	4,546
మోటార్ కార్స్	14,831
మోటార్ సైకిల్స్	1,42,665
మొత్తం	1,68,604

నేడు రక్షాబంధన్

- కొనుగోలుదారులతో మార్కెట్లు కిటకిట



జగిత్యాలలోని ఓ దుకాణంలో రాఖీలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

జగిత్యాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా శనివారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరుపుకోనున్నారు. పలు ప్రాంతాల్లో గల మార్కెట్‌లో రక్షా బంధన్ సందర్భంగా రాఖీ విక్రయ కేంద్రాలు శుక్రవారం కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. జిల్లా కేంద్రంతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి పట్టణాలు, ఇతర ప్రాంతాల్లో రాఖీ కేంద్రాలు వెలిశాయి. హైదరాబాద్, ముంబాయి తదితర ప్రాంతాల నుంచి తీసుకవచ్చి రాఖీలను పలువురు వ్యాపారులు స్థానిక మార్కెట్లలో విక్రయిస్తున్నారు. రాఖీ విక్రయ కేంద్రాల వద్ద రద్దీ నెలకొంది.

అన్నాచెల్లెళ్ల ఆత్మీయ వేడుక రక్షాబంధన్

- అదనపు కలెక్టర్ బీఎస్ లత



టీఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడికి రాఖీ కడుతున్న అదనపు కలెక్టర్

జగిత్యాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అన్నా చెల్లెళ్ల ఆత్మీయ వేడుక రక్షా బంధన్ అని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో టీఎన్‌జీవో సంఘం ఆధ్వర్యంలో ముందస్తు రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బీఎస్ లత మాట్లాడారు. రాఖీ పండుగ అంటే సోదరి, సోదరుల మధ్య ఉన్న ప్రేమానురాగాలకు ప్రతీక అన్నారు. ఈకార్యక్రమంలో టీఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు మిర్యాల నాగేందర్ రెడ్డి, కలెక్టరేట్ కార్యాలయ ఏఓ సాదాబ్ హకీమ్, జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్, మెప్మా ఏఓ దుర్గపు శ్రీనివాస్ గౌడ్, నాయకులు సాహేద్ బాబు, రవీందర్, ఖాజీమ్, మమత, శైలజ, శ్రావణి, భాగ్య లక్ష్మీ, నిర్మల, శ్రీలక్ష్మీ, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు అరుణ పాల్గొన్నారు.

'ఇసుక రీచ్‌ను రద్దు చేయాలి'



ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ గ్రామస్థులు మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఇటీవల ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కోరకు, సూరమ్మ ప్రాజెక్ట్ నిర్మాణం కోరకు ఇసుక తవ్వకాలకు అనుమతి ఇవ్వడంతో అధిక సంఖ్యలో టిప్పర్ల ద్వార వాగు నుండి ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని ఆరోపించారు. ఈ తవ్వకాలవల్ల గ్రామంలో భూగర్భజలాలు అడుగంటే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను వెంటనే రద్దు చేయాలని వందల సంఖ్యలో గ్రామస్థులు ఆర్డీఓ కార్యాలయంకు వచ్చి వినతిపత్రం అందజేశారు. వాగు మధ్యలోనే పెద్ద బావిఉందని, దీని ద్వారానే గ్రామం మొత్తం సాగు, తాగునీరు సరఫరా అవుతుందని తెలిపారు. ఇసుక తవ్వకాలు చేపట్టడం వల్ల నీటి లాభ్యత తగ్గిందని, ప్రభుత్వం మా సమ స్యను గుర్తించి ఇసుక రీచ్‌ను రద్దు చేయాలని వారు కోరారు. అదే విధంగా గ్రామానికి కింది భాగంలో వరద కాలువ ఉన్న పంట పొలాలకు చుక్కనీటి లభ్యత లేదన్నారు. భారీసంఖ్యలో గ్రామస్థులు ఆర్డీవో కార్యాలయంకు తరలిరావడంతో మెట్‌పల్లి ఎస్‌ఐ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కూర్ గ్రామాస్తులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రాన్ని మెడికల్ హబ్‌గా మార్చేందుకు కృషి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల అర్బన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రాన్ని మెడికల్‌హబ్ మార్చేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల పట్టణంలో కొత్త ఆసుపత్రి కోసం రెండువందల మూడు కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. జగిత్యాల పట్టణం వైద్యపరంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. జగిత్యాల పట్టణానికి కొత్త ఆసుపత్రి మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రికి ఆరోగ్య శాఖ మంత్రికి జగిత్యాల ప్రజల తరపున ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కొత్త రేషన్ కార్డుల మంజూరుతో పేదల ఆహార భద్రతకు ఎలాంటి ఢోకా లేవుండా పోయిందని, ఇందిరమ్మ ఇళ్ళ మంజూరుతో పేదల సొంతింటి కళ సాకారం కానుందన్నారు. నూకపెల్లిలో అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇళ్ళ లబ్దిదా రులకు నిధులు మంజూరుతో లబ్ది చేకురుతుం దన్నారు. అభివృద్ధి విషయంలో అందరు కష్టపడి పని చేయాలని అభివృద్ధికి అడ్డుపడితే ప్రజలు క్షమించరన్నారు. రోగం వచ్చాక ఆసుపత్రులకు తిరెగేకన్నా రోగం రాకుండా జాగ్రత్తలు పాటించడం ఉత్తమం అన్నారా. మత్తుపదార్థాల విషయంలో తల్లిదండ్రులు పిల్లలను ఒకకంట కని పెడుతూ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మా జీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్, మాజీ ఏఎంసి ఛైర్మన్‌లు కొలగూరి దామోదర్‌రావు, నక్కరాధ, శంకర్, పంబాల రాంకుమార్, కూతురు రాజేష్, చెట్‌పెల్లి సుధాకర్, కొక్కుల ఎల్.జి రమేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల, తక్కళ్లపల్లి సబ్ స్టేషన్లవద్ద శనివారం మరమ్మతులు జరుగనున్న దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈఈ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆయా సబ్‌స్టేషన్ల పరిదిలోని మల్యాల, ముత్యంపేట, రాజారం, నూకపల్లి, మల్యాల క్రాస్‌రోడ్డు, తక్కళ్లపల్లి, మ్యాడంపల్లి, మానాల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

ఇద్దరు అధ్యాపకులకు పదోన్నతి

జగిత్యాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్)కు చెందిన ఇరువురు అధ్యాపకులు డాక్టర్ గోలి శ్రీలత, కెమిస్ట్రి విభాగానికి చెందిన డాక్టర్ నీలి వాసవిలకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పిస్తూ కలాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన ఉత్తర్వుల జారీ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ తెలిపారు. పదోన్నతి పొందిన అధ్యాపకులను ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణతో పాటు అధ్యాపకులు డాక్టర్ తత్వాది ప్రమోద్ కుమార్, డాక్టర్ వాసాల వరప్రసాద్, చంద్రయ్య, మల్లికార్జున్, రామచంద్రం, సంగీత, సుజాత, నీరజ, జమున, సత్యం అభినందించారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

మేడిపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మేడిపల్లి పోలీసు స్టేషన్‌ను డీఎస్పీ రాములు శుక్రవారం తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, స్టేషన్ రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తూ నేరాల నియంత్రణలో చురుకుగా పని చేయాలని ప్రజలతో సత్సంబందాలు కలిగి పోలీస్ డిపార్మెంట్ పెంపొందించాన్నారు. గణేష్ నవరాత్రులు, లోకల్ బాడీ ఎన్నికల్లో సమర్థవంతంగా విధులు నిర్వహణకు సిద్ధంగా ఉండాలన్నారు. బ్లూకోల్ట్ మరియు పెట్రో కారు విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. స్టేషన్ నిర్వహణ పారిశుధ్యంపై ఎస్సైని అభినందించారు. కార్యక్రమంలో కోరుట్ల సిఐ సురేష్‌బాబు, మేడిపల్లి ఎస్సై శ్రీదర్ రెడ్డి, కోరుట్ల ఎస్సై చిరంజీవి పాల్గొన్నారు.

'ఈ పాస్'తోనే ఎరువులు విక్రయించాలి



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డీఏవో భాస్కర్

బుగ్గారం, ఆగస్టు08 (ఆంధ్రజ్యోతి): ఈపాస్ ద్వారానే ఎరువులను విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ అన్నారు. బుగ్గారం మండలంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. పిఎసిఎస్ ఎరువుల గోదం లో ఎరువుల స్టాక్ రిజిస్టర్ బిల్లు బుక్కులను పరిశీలించి, రైతులకు ఎరువులు ఈపాస్ మిషన్ ద్వారా అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. రైతులకు ఎరువులు ఈపాస్ మిషన్ ద్వారానే ఎరువులను విక్రయించాలని ఎరువుల డీలర్లను ఆదేశించారు, ఆధార్‌కార్డు ఆధారంగా ఎరువులను విక్రయించాలని సూచించారు.

మండల కేంద్రంలోని ప్రైవేట్ ఎరువుల దుకాణలను తనిఖీ చేసి నిలవుల రిజిస్టర్ లను పరిశీ లించారు. డీలర్లు ఎరువులు పురుగుల మందులు విత్తనాల స్టాక్ బోర్డులను రైతులకు కనబడే విధంగా ప్రదర్శించాలని సూచించారు. రైతులకు ఎరువులతో పాటు పురుగుల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి రైతుకు మొదటి దఫాలో ఎకరానికి ఒక బస్తా చొప్పున యూరియా ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి అక్షిత తదితరులు పాల్గొన్నారు.

నానో ఎరువులు వాడాలి

ధర్మపురి: రైతులు నానో ఎరువులు వాడాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాస్కర్ అన్నారు. ధర్మపురి మండలంలోని నర్సయ్యపల్లె రైతు వేదిక వద్ద ఇఫ్కో సంస్థ ఆధ్వర్యంలో ధర్మపురి డివిజన్ పరిధిలో గల మండల ఏవోలు, ఏఈవోలు, పీఏసీఎస్ సీఈవోలు, రైతులకు నానో ఎరువుల అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయానికి ఎరువులను తగ్గించి వాటికి ప్రత్యామ్నాయంగా నానో ఎరువులు వాడడం వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గుతుందని సూచించారు. యూరియా బాటిల్ 500 మిల్లీ లీటర్లు ఒక 45 కిలోల యూరియా బస్తాకు సమానమన్నారు. పని చేసే సామర్థ్యం నానో యూరియాకు ఎక్కువగా ఉంటుందని తెలిపారు. సులువుగా వివిధ రకాల పురుగు మందులలో నానో ఎరువులను కలుపుకొని వాడవచ్చని ఆయన తెలిపారు.

ధర్మపురి ఏడీఈ రాంచందర్ మాట్లాడుతూ అధిక రసాయనిక ఎరువుల వాడటం వల్ల కలిగే నష్టాలు గురించి వివరించారు. ఆర్ఏఆర్ఎస్ పొలాస సైంటిస్ట్ డాక్టర్ రవి మాట్లాడుతూ భూసార పరీక్షల ప్రాముఖ్యత గురించి, పంట మార్పిడి ప్రాముఖ్యత గురించి తెలిపారు. ఇఫ్కో సంస్థ మేనేజర్ శ్రీధర్ మాట్లాడుతూ ఇఫ్కో నానో ఎరువులు కొనుగోలు చేసే ప్రతి రైతుకు ఆ సంస్థ ఉచిత సంకటహరణ బీమా పథకాన్ని వర్తింపజేస్తుందని తెలిపారు.సమావేశంలో ధర్మపురి ఏడీఏ రాంచందర్, ఆర్ఏఆర్ఎస్ పొలాస సైంటిస్ట్ డాక్టర్ రవి, ఇఫ్కో సంస్థ మేనేజర్ శ్రీధర్, మండల రాజ్‌కుమార్, కరుణ, శ్రీకాంత్, అక్షిత, సాయికిరణ్ పాల్గొన్నారు.

వృద్ధురాలి హత్య కేసు నిందితుడి అరెస్ట్

- దూషించినందుకే తలపై మోది హత్య 6

వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు 8

'అరాచక పాలనకు కేరాఫ్ కాంగ్రెస్ '

జగిత్యాల క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అరాచక పాలనకు కేరాఫ్ అడ్రస్‌గా కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. గొల్లపెల్లి మండల కేంద్రానికి చెందిన దండ్ల శ్రీనివాస్ అనే వ్యక్తిపై మంత్రి అనుచరుల దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ శుక్రవారం జగిత్యాల డీఎస్పీ రఘుచందర్‌ను మాజీ మంత్రి ఈశ్వర్ కలిసి దాడికి పాల్పడ్డ నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాస్‌ను ఈశ్వర్ పరామర్శించారు. మాజీ జడ్పీ చైర్ పర్సన్, వైస్ చైర్మన్ దావ వసంత, హరిచరణ్ రావు, గొల్లపెల్లి మండల నాయకులు జలంధర్, సత్యం, మాధవ రావు, రవీందర్, శేఖర్, అశోక్ రావు తదితరులు ఉన్నారు.

యాదవుల హక్కుల కోసం పోరాటం

కథలాపూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : యాదవుల హక్కుల కోసం నిరంతరం పోరాటం సాగిస్తామని జిల్లా యాదవ సంఘం అడహాక్ కమిటీ అధ్యక్షుడు గనవేని మల్లేశ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తాండ్ర్యాలలో సభ్యత్వ నమోద కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో యాదవ జనాభా దామాషా ప్రకారం తమకు దక్కాల్సిన వాటా కోసం ఐక్యంగా పోరాటాలు సాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల కార్య వర్గ సభ్యులు జెల్ల వేణు, బొడ్డు బాలు, అరికంటి సాగర్, బర్ల మధు, జంగ రంజిత్ సహా సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

జగిత్యాల అగ్రికల్చర్, ఆగష్టు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజురీయంబర్స్‌మెంట్ ను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని ధర్మ స్టూడెంట్స్ యూనియన్(డీఎస్‌యూ) జిల్లా కన్వీనర్ వెంకటేష్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, విద్యా సంవత్సరం పూర్తయిన విద్యార్థులకు యాజమాన్యం సర్టిఫికెట్లు అందించేందుకు ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. లేని యెడల పెద్ద ఎత్తున డీఎస్‌యూ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోకన్వీనర్ ఆర్యన్ తో కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్‌కుమార్



డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదేశించారు. సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని కాశెట్టివాడ, బోయవాడలో నిర్మాణ దశలో ఉన్న సీసీ, డ్రైనేజీ నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో జాప్యం చేయరాదని అన్నారు. ప్రతి వార్డులో వార్డు ఆఫీసర్ తిరుగుచూ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం చేయాలని ఆయన తెలిపారు. ఇటీవల కురిసిన వర్షం వల్ల కొత్తగా నిర్మాణ దశలో ఉన్న డ్రైనేజీలో నీరు చేరి ఇళ్లలోకి ప్రవేశించినట్లు బాధితులతో ఆయన మాట్లాడారు. కాశెట్టివాడ, బోయవాడలో గల ఇంటి యజమానుల వద్దకు వెళి బాధితులతో ఆయన సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వర్షం వల్ల ఇబ్బందులు లేకుండా చూడాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, యువజన కాంగ్రెస్ నాయకులు సింహరాజు ప్రసాద్, మున్సిపల్ మేనేజర్ బాలె గంగాధర్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ చిట్యాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు..

పెద్దలు కుదిర్చిన పెళ్లి ఇష్టం లేక..
యువతి బలవన్మరణం


సంధ్య మృతదేహం

చొప్పదండి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పెద్దలు కుదిర్చిన పెళ్లి ఇష్టం లేక ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. చొప్పదండి పట్టణానికి చెందిన వనపర్తి సంధ్య(27) కరీంనగర్‌లో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తోంది. వారం క్రితం కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామానికి చెందిన యువకుడితో పెళ్లి నిశ్చయమైంది. ఈనెల 14న వివాహం జరగాల్సి ఉంది. వివాహం కోసం అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. పెళ్లిపనుల్లో భాగంగా యువతి తల్లిదండ్రులు పెళ్లి కార్డులను పంచేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూలేని సమయంలో సంధ్య ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కార్డులు పంపిణీ చేసి శుక్రవారం మధ్యాహ్నం తల్లిదండ్రులు వచ్చి చూసేసరికి సంధ్య మృతిచెంది ఉంది. తండ్రి కనుకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేష్ రెడ్డి తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

జమ్మికుంట రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం శ్రీరాములపల్లె రోడ్డు కట్ట వద్ద ఉడుత తిరుపతి(45) పురుగుల మందు తాగి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన తిరుపతి ప్రతి రోజు మద్యం తాగి కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. ఈ నెల 7వ తేదిన ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మరుసటి రోజు ఉదయం శ్రీరాములపల్లె రోడ్ కట్టవద్ద తిరుపతి మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్థులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి కుమార్తె రమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

పొలంలో వరి నారు గుంజుతూ కూలీ మృతి

సైదాపూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘనపూర్ గ్రామానికి చెందిన గుంటి అనిల్(35) అనే కూలీ వరి నారు గుంజుతూ పొలంలోనే పడి మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం అనిల్ అదే గ్రామానికి చెందిన గుర్రాల మల్లారెడ్డి అనే రైతు వ్యవసాయ పొలంలో నారు గుంజేందుకు వెళ్లాడు. నారు గుంజుతూ అకస్మాత్తుగా పొలంలో పడి పోయాడు. నాటు వేసేవారు వెళ్లి చూడగా మృతిచెంది ఉన్నాడు. దీంతో వెంటనేవారు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని కన్నీరు మున్నీరయ్యారు. తనకుమారుడి మరణంపై ఎలాంటి అనుమానం లేదని మృతుడి తల్లి లచ్చమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మరొకరికి గాయాలు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కొత్తపల్లి వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగాధరకు చెందిన రాజుల యాదయ్య(50) దుర్మరణం చెందగా, గంగాధర వేణు తీవ్రంగా గాయపడ్డాడు. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి వివరాల ప్రకారం.. యాదయ్య, వేణు ద్విచక్రవాహనంపై కరీంనగర్ కేడీసీసీ బ్యాంక్‌కు వచ్చి తిరిగి గంగాధరకు బయల్దేరారు. కొత్తపల్లి శివారులో ఎదురుగా వచ్చిన కారు అతివేగంగా బైక్‌ను ఢీకొని మరో కారును ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంపై వెనుకకూర్చున్న యాదయ్య రెండువాహనాల మధ్య ఇరుక్కుని తీవ్రగాయాలతో అక్కడికక్కడే మరణించాడు. వేణుకు గాయాలయ్యాయి. యాదయ్య మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి, గాయపడిన వేణును అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సైసాంబమూర్తి సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. యాదయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

● రోడ్డు ప్రమాదానికి గురైన క్షతగ్రాత్రుడిని మైత్రీ గ్రూప్ చైర్మన్ కొత్త జయపాల్‌రెడ్డి అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించారు. రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో స్వయంగా ట్రాఫిక్ క్లియర్ చేశారు.



కాళ్ల పారాణి ఆరక ముందే కానరాని లోకాలకు..

ఈ చిత్రంలో చిరునవ్వులు చిందిస్తోన్న వధువు పేరు ముద్దసాని అఖిల.. చొప్పదండి మండలం రుక్మాపూర్‌కు చెందిన ఆమె వివాహం ఈ నెల 6న జగిత్యాల జిల్లా లొత్తునూరుకు చెందిన రాజుతో జరిగింది. కోటి ఆశలతో వివాహ బంధంలోకి వెళ్లిన ఆమెను మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. పీజీ ఎంట్రెన్స్ రాసి భర్తతో కలిసి తిరిగి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఓ లారీ వెనక నుంచి ఢీకొంది. రోడ్డుపై పడ్డ అఖిలను ఆ లారీ తొక్కుకుంటూ వెళ్లడంతో ఆమె తల నుజ్జునుజ్జయి సంఘటన స్థలంలోనే మృతి చెందింది. రాజు కాస్త పక్కకు పడడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

● రోడ్డు ప్రమాదంలో నవ వధువు మృతి
● భర్తకు గాయాలు
● పీజీ ఎంట్రెన్స్ పరీక్షరాసి వెళుతుండగా ఘటన


అఖిల (ఫైల్)

తిమ్మాపూర్/చొప్పదండి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నవ వధువు.. కాళ్ల పారాణి ఆరకముందే కానరాని లోకాలకు వెళ్లి పోయింది. 22ఏళ్లకే నిండు నూరేళ్ల నిండాయి. పెళ్లైన రెండు రోజులు కూడా గడవక ముందే ఆమె రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబలించింది. ఈ సంఘటన రెండు గ్రామాల్లో విషాదం నింపింది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చొప్పదండి మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన ముద్దసాని లత-నర్సయ్య దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె ముద్దసాని అఖిల (22) వివాహాన్ని ఈ నెల 6న వెల్గటూరు మండలం లొత్తునూర్ గ్రామానికి చెందిన రాజుతో ఘనంగా జరిపించారు. అదే రోజు నూతన వధూవరులు లొత్తునూర్‌కు వెళ్లారు. తిరిగి శుక్రవారం ఉదయం రుక్మాపూర్‌కు వచ్చారు. అఖిలకు పీజీసెట్ ప్రవేశపరీక్ష కోసం ద్విచక్ర వాహనంపై తిమ్మాపూర్ వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ వేగంగా ఢీకొట్టింది.


అఖిల మృతదేహం

దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న నవదంపతులు రాజు, అఖిల కింద పడిపోయారు. లారీ వేగంగా అఖిల తలపై నుంచి వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. భర్త రాజు స్వల్పగాయాలతో బయట పడ్డాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్, సిబ్బంది ప్రమాదానికి కారణ మైన లారీని పట్టుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసు కున్నారు. మృతురాలు అఖిల తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వచ్చాక నల్లపూసలు గుచ్చుకుంటానని చెప్పి వెళ్లి..

పరీక్ష పూర్తయిన వెంటనే రుక్మాపూర్‌కు వచ్చి పెళ్లితంతు కార్యక్రమంలో (నల్లపూసలు గుచ్చుకోవడం) పాల్గొంటామని చెప్పి ఇద్దరూ వెళ్లారు. కూతురు కోసం ఎదురు చూస్తున్న తల్లిదండ్రులకు మరణవార్త వినిపించడంతో కుప్పకూలిపోయారు. ఎంతో సంతోషంగా కూతురు అల్లున్ని చూసి మురిసిపోయిన వారి కుటుంబంలో ఒక్కసారిగా విషాదచాయలు అలుముకున్నాయి. కూతురు వివాహాన్ని ఘనంగా జరిపించామన్న సంతోషం ఆ కుటుంబంలో ఒక్కరోజు కూడా నిల్వలేదు. పెళ్లి తంతు కార్యక్రమం అనంతరం తమ్ముడికి రాఖీ కడతానని చెప్పి వెళ్లిన అఖిల తిరిగి రానిలోకాలకు వెళ్లడంతో తమ్ముడు తల్లడిల్లిపోయాడు. అఖిల మృతి రుక్మాపూర్‌తో పాటు లొత్తునూర్‌లో విషాదం నింపింది.

సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టిన ఇద్దరిపై కేసు

ఇల్లంతకుంట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్కానిపేట గ్రామానికి చెందిన ఇందిరమ్మ కమిటీ సభ్యుడు సావనపెల్లి శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోషల్‌మీడియాలో మీడియాలో పోస్టులు పెట్టిన ఇరువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం ఇల్లంతకుంటకు చెందిన సాదుల్ తనని అవమానించే విధంగా సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడని, అదే విధంగా నర్సక్కపేట గ్రామానికి చెందిన కొత్త రాజు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మీద అసభ్యకరంగా మార్ఫింగ్ వీడియోలు పెట్టాడని వచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సోషల్‌మీడియాలో అభ్యంతరకరంగా పోస్టులు ఎవరు పెట్టవద్దన్నారు. ఇతరుల మనోభావాలు కించపర్చేలా వ్యవహరిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

పాఠశాలలో గ్యాస్ సిలిండర్ చోరీ

మల్లాపూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామంలోని ప్రాథమికపాఠశాల వంట గది తాళం పగులగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు గ్యాస్ సిలిండర్‌ను అపహరించుకెళ్లినట్లు బాధిత ఆయా మహ్మద్‌రజియా శుక్రవారం వాపోయింది. మధ్యాహ్నభోజనం అనంతరం గురువారం వంటగదికి తాళంవేసి శుక్ర వారం వచ్చిచూడగా సిలిండర్ లేదన్నారు. మొగిలిపేట గ్రామంలో ఇటీవల వరుసగా సిలిండర్ల చోరీకి గురవుతున్నాయని పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాల్సినగ్రామస్థులు కోరుతున్నారు.

ఫేక్ ఫేస్ రికగ్నిషన్ వ్యవహారంలో.. మరో నలుగురు కార్యదర్శులపై వేటు

జగిత్యాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఫేక్ ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ వ్యవహారంలో మరో నలుగురు పంచాయతీ కార్యదర్శులపై వేటుపడింది. శుక్రవారం జిల్లాలోని ముగ్గురు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ, ఒక పంచాయతీ కార్యదర్శిని ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ఫేక్‌ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ వ్యవహారంలో సంబంధితయాప్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫోటోను అప్‌లోడ్ చేసిన బుగ్గారం మండలం చందాయపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్, ఇరవై మంది కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం విదితమే. జూలైలో 24పని దినాలకు గాను 20పనిదినాల వరకు ఫేక్ ఫేస్‌రికగ్నిషన్ అటెండెన్స్‌కు పాల్పడిన నలుగురు కార్యదర్శులపై అధికారులు వేటు వేశారు. బుగ్గారంమండలం గోపులాపూర్‌లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శిని ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బీర్‌పూర్‌మండలం రేకులపల్లి, మల్యాల మండలం రాజారం, ధర్మపురి మండలం నాగారంపంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వీరితోపాటు మరో17మంది పంచాయతీ కార్యాదర్శులకు వేతనాల్లో కోతవిధిస్తూ ఉత్తర్వులుజారీ అయ్యాయి. కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీచేసినట్లు జిల్లా పంచాయతీఅధికారి మదన్‌మోహన్ తెలిపారు.

నిందితుడిని అదుపులోకి తీసుకున్న రాజస్థాన్ పోలీసులు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ రాష్ట్రంలో కిడ్నాప్ కేసుకు సంబంధించి నిందితుడిని కొత్తపల్లి శివారులో రాజస్థాన్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. కిడ్నాప్ కేసులో నిందితుడిగా ఉన్న హైదరాబాద్‌కు చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి కోసం రాజస్థాన్ పోలీసులు వెతుకుతున్నారు. నిందితుడు హైదరాబాద్ నుంచి జగిత్యాల వైపు వెళ్తుండగా మార్గమధ్యలో కొత్తపల్లి వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కొత్తపల్లి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం నిందితుడిని రాజస్థాన్‌కు తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపాక గ్రామంలోని మానేరువాగు నుంచి అక్రమంగా ఇసుకరవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీస్‌లు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొండపాక గ్రామానికి చెందిన నాగుల రాజు, అవాల గిరిబాబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

పేకాటరాయుళ్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలం నగునూర్‌లోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. వారినుంచి రూ.16.500నగదు, 7బైక్‌లు, 8సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

కార్లు కిరాయికి పెడతానంటూ నమ్మించి మోసం

● మరొకరి దగ్గర కుదువ పెట్టి లక్షల్లో అప్పు ● నిందితుడి అరెస్టు, నాలుగు కార్లు, సెల్‌ఫోన్ సీజ్


స్వాధీనం చేసుకున్న కార్లు, నిందితుడితో ఏసీపీ రమేష్, అధికారులు

కోల్‌సిటీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): దళిత బంధు లబ్ధిదారులు, ఇతర కారు యజమానుల వద్ద తాను కార్లు అద్దెకు పెట్టించి నెలానెలా కిరాయి ఇప్పిస్తానంటూ నమ్మించి యజమానులకు తెలియకుండా కార్లు కుదువ పెట్టుకున్న గోదావరిఖని ఎల్‌బీనగర్‌కు చెందిన మారుపెల్లి ప్రణయ్ భాస్కర్(29) అనేవ్యక్తిని శుక్రవారం వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసినట్టు గోదావరిఖని ఏసీపీ రమేష్ పేర్కొన్నారు. స్థానిక వన్‌టౌన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన అరెస్టు వివరాలను వెల్లడించారు. గోదావరిఖని ఎల్‌బీనగర్‌కు చెందిన బోడ తిరుపతి, శ్రీనగర్‌కాలనీకి చెందిన కాసర్ల మేఘమాల, ఇల్లంతకుంట మండలం వంతడుపులకు చెందిన సప్పి కుమార్, సప్పి మొగిలిల నుంచి తాను కార్లు అద్దెకు పెట్టిస్తానంటూ మారుపెల్లి ప్రణయ్ భాస్కర్ అనే కారు డ్రైవర్ కొన్ని నెలల క్రితం కార్లను తీసుకెళ్లాడు. ఈ కార్లను హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ ప్రాంతాల్లో అద్దెకు పెట్టానంటూ నమ్మించాడు. ఒకటి రెండు నెలలు అద్దె కూడా ఇచ్చాడు. జల్సాలకు అలవాటు పడిన ప్రణయ్ భాస్కర్ ఈ కార్లను కొందరి వద్ద తనఖా పెట్టి కారుకు రెండు మూడు లక్షల చొప్పున రూ.10లక్షల వరకు అప్పు తీసుకున్నాడు. యజమానులు ఫోన్ చేస్తే స్పందించకుండా హైదరాబాద్‌కు పరారై తప్పించుకుని తిరుగుతున్నాడు. అతనికి సోదరి జూపాక పుష్పలత, సప్తగిరి కాలనీకి చెందిన వనం శ్రీనివాస్ సహకరించారు. బాధితుడు బోడ తిరుపతి ఇచ్చిన ఫిర్యాదుమేరకు సీఐ ఇంద్రసేనారెడ్డి కేసు నమోదు చేసుకుని నాలుగు కార్లు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఏసీపీ రమేష్ పేర్కొన్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని తెలిపారు. ఎవరైనా వాహనాలను తనఖా పెట్టుకునే ముందు పూర్తివివరాలను తెలుసుకోవాలన్నారు. ఇలాంటి వాహనాలు తనఖా పెట్టుకుంటే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రణయ్ భాస్కర్ బాధితులు ఎవరైనా ఉంటే వన్‌టౌన్‌పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. నిందితున్ని పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ ఇంద్రసేనారెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు రమేష్, సదానందం, ఏలియా, కానిస్టేబుల్ మధుకర్, రమేష్‌లను ఏసీపీ అభినందించారు.

జోరుగా మట్టి దందా

● ప్రభుత్వ భూములే లక్ష్యం
● అడ్డుకున్న గ్రామస్థులు


మట్టి టిప్పర్లను అడ్డుకుంటున్న గ్రామస్థులు

జూలపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో మట్టి అక్రమరవాణా జోరుగా సాగుతోంది. మట్టి మాఫియాకు రాజకీయ పలుకుబడి తోడవడంతో అడ్డూ అదుపులేకుండా సాగుతోంది. మండలంలోని చీమలపేట గ్రామశివారులోని దామెరచెరువుకు అతి సమీపంలో గల గుట్టబోరు మట్టిని ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా తవ్వుతూ టిప్పర్ల ద్వారా నాలుగురోజులుగా మట్టిని ఇతర మండలాలకు తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. కొందరు గ్రామస్థులు గురువారం మట్టి టిప్పర్లను అడ్డుకున్నారు. మట్టిని తరలిస్తున్న విషయమై మైనింగ్ అధికారులకు శుక్రవారం చేశారు. దీనిపై అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గుట్టబోరు మట్టిని తొలగించడం వల్లా దామెర చెరువులో నీరు నిలువక ఎడారిగా మారే ప్రమాదం ఉందని గ్రామస్థులు మండిపడుతున్నారు. అంతే కాకుండా కొందరు మట్టిమాఫియా కేటుగాళ్లు గ్రామంలోని విలువైన ప్రభుత్వ భూముల్లో చెట్లను నరికి వేయడమే కాకుండా చెట్లకర్రలను, మట్టిని అమ్ముకుని సొమ్ముచేసుకుంటున్నారని చెపుతున్నారు. మట్టిని తొలగించిన భూమిని సాగుకు వాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు.

ఈ విషయమై జిల్లామైనింగ్ అధికారి శ్రీనివాస్‌ను వివరణ కోరగా దామెరచెరువు పక్కన మట్టిని తొలగించేందుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని అన్నారు. రోడ్డునిర్మాణాలకు మట్టి తరలిస్తే ఆపనుల నుంచి ప్రభుత్వానికి సొమ్ము జమచేయబడుతుందని పేర్కొన్నారు. అక్కడి ప్రదేశాన్ని పరిశీలించి తదుపరిచర్యలు తీసుకుంటామన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్


నిందితుడిని అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాల క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంతోపాటు రూరల్ మండలంలో కొన్ని రోజులుగా ఇళ్లముందు నిలిపిఉన్న ద్విచక్ర వాహనాలను ఎత్తుకెళ్తున్న పడాల దినేష్ అనే నిందితుడిని జగిత్యాలపట్టణ పోలీసులు శుక్రవారం అరెస్టుచేశారు. టౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ రఘుచందర్ వివరాలు వెల్లడించారు. పట్టణపోలీసులు శుక్రవారం ఎస్‌కేఎన్ఆర్ కళాశాల సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా జగిత్యాలరూరల్ మండలం పొలాస గ్రామానికి చెందిన పడాల దినేష్ ద్విచక్రవాహనంపై అనుమానాస్పదంగా వెళ్తుండగా పట్టుకున్నామన్నారు. విచారణలో ద్విచక్రవాహనాల దొంగగా గుర్తించామన్నారు. దినేష్‌పై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ వివరించారు. నిందితుడి వద్ద 9 వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సమావేశంలో టౌన్ సీఐ కరుణాకర్, ఎస్సైలు సుప్రియ, రవి కిరణ్, కుమారస్వామి ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కలెక్టర్ కొరడా

● ఇసుక డంప్‌ల సీజ్
● జల్లెడ పడుతున్న పోలీస్, రెవెన్యూ అధికారులు
● 'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందన

కోల్‌సిటీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై కలెక్టర్ కోయ శ్రీహర్ష కొరడా ఝుళిపించారు. ఇసుక మాఫియా శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై స్పందించిన కలెక్టర్ రెవెన్యూ, పోలీస్, మైనింగ్ విభాగాల అధికారులతో తనిఖీ చేయించారు. వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఇసుక నిల్వలు ఉన్నట్టు గుర్తించారు. రామగుండం అర్బన్ పరిధిలోని పాములపేట, మేడిపల్లి ఇసుక రీచ్‌లను మూసివేశారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలతో రామగుండం తహసీల్దార్ శ్రీపాద ఈశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే రామగుండం మండల పరిధిలోని ఎఫ్‌సీఐ, సంజయ్‌గాంధీనగర్, గోదావరిఖని సప్తగిరికాలనీ, జనగామలో ఇసుకరీచ్‌లను సీజ్‌చేశారు. 190ట్రాక్టర్ ట్రిప్పులను స్వాధీనం చేసుకున్నారు. సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన బెంద్రం రాజిరెడ్డి, సప్తగిరికాలనీకి చెందిన గుంపుల ఓదెలు, మరికొంత మందిపై 303/2బీఎన్ఎస్, 21ఎంఎండీఏఆర్ఏ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు పోలీసులు పేర్కొంటున్నారు. శుక్రవారం కలెక్టర్ ఆదేశాల మేరకు రామగుండం అర్బన్ పరిధిలోని ఎన్‌టీపీసీ, గోదావరిఖని, జనగామ ప్రాంతాల్లో పోలీసులు, రెవెన్యూ అధికారులు విస్తృత తనిఖీలు జరిపారు. ఏసీపీ రమేష్ సారథ్యం వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐలు రమేష్, భూమేష్, టుటౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు, ఎన్‌టీపీసీ ఎస్ఐ ఉదయ్‌కిరణ్‌లు తనిఖీల్లో పాల్గొన్నారు. ఎన్‌టీపీసీ, గోదావరిఖని, జనగామ ప్రాంతాల్లో పలు ఇసుక డంప్‌లను సీజ్ చేశారు. మూసివేసిన పాములపేట, మేడిపల్లి క్వారీలకు ట్రాక్టర్లు వెళ్లకుండా రెవెన్యూ అధికారులు కందకాలు తీశారు. శుక్రవారం ఎన్‌టీపీసీ పీటీఎస్ సమీపంలోని ఇసుక డంప్‌ను సీజ్‌చేశామని, అలాగే జనగామలో మరో డంప్‌ను సీజ్ చేసినట్టు తహసీల్దార్ శ్రీపాద ఈశ్వర్ పేర్కొన్నారు. రామగుండం మండల పరిధిలోని ఇసుక రీచ్‌లను నిషేధించామని, ఇక నుంచి ఎవరైనా గోదావరినదిలోకి ట్రాక్టర్లను దించి ఇసుకను తీసుకువచ్చినా, డంప్ చేసినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వృద్ధురాలిని హత్య చేసిన నిందితుడి అరెస్ట్

● దూషించినందుకే తలపై మోది హత్య



మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

కొడిమ్యాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామానికి చెందిన మెన్నేని ప్రేమలత అనే వృద్ధురాలి హత్య కేసులో నిందితుడైన నాచుపల్లి గ్రామానికి చెందిన సురభి రఘునందన్‌రావును శుక్రవారం అరెస్టుచేసినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. శుక్రవారం కొడిమ్యాల పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. ప్రేమలత రఘునందన్‌రావుకు వరుసకు అత్తమ్మ అవుతుంది. నిందితుడు కనిపించినప్పుడల్లా ప్రేమలత బూతులుతిట్టేది. దీంతో ఆమెపై రఘునందన్‌రావు కోపం పెంచుకున్నాడు. గతసంవత్సరం ప్రేమలతకు, నిందితుడికి మధ్య గొడవ జరగ్గా పెద్దమనుషులు పంచాయితీ నిర్వహించి సర్దిచెప్పారు. బుధవారం రాత్రి వృద్ధురాలు ఊరినుంచి ఇంటికివెళ్తుండగా రఘునందన్ రావును చూసి దూషించింది. దీంతో ప్రేమలతను అక్కడే ఉన్న కర్రతో తలపై కొట్టి బండరాయితో బాదడంతో ఆమె మృతి చెందింది. అనంతరం మృతురాలి ఇంటి ముందు ఉన్న నీరు లేని బావిలో పడవేశాడు. నిందితుడికోసం గాలించి శుక్రవారం ఉదయం దొంగలమర్రి సమీపంలోపట్టుకొని అరెస్టు చేశామన్నారు. ఈ సమావేశంలో మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల, ఎస్సై సందీప్ ఉన్నారు.

ఉపాధిహామీలో ఈకేవైసీ విధానం

● అక్రమాల అడ్డుకట్టకు చర్యలు
● ఈ నెల 15 నుంచి అమలు


ముఖచిత్రం ద్వారా హాజరు తీసుకుంటున్న సిబ్బంది

కరీంనగర్ రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో ఈకేవైసీ విధానాన్ని అమలులోకి తీసుకురానుంది. దీంతో నేషనల్ మొబైల్ మానిటరింగ్ యాప్‌లో నకిలీ ఫొటోల అప్‌లోడ్‌కు అడ్డుకట్ట పడనుంది. ఉపాధిహామీ పనుల కోసం వచ్చిన కూలీలను ఫీల్డ్ అసిస్టెంట్‌లు రెండు సార్లు ఫొటోలు తీయాల్సి ఉంటుంది. ముందుగా పనులకు వచ్చిన వెంటనే ఒకసారి, నాలుగు గంటల తరువాత మరోసారి ఫొటో తీస్తారు. ఈ రెండు ఫొటోల్లో కూలీలు ఒకేలా ఉంటేనే వేతనాలు మంజూరవుతాయి. తేడా ఉంటే వేతనాలు నిలిపివేస్తారు. ఆగస్టు 15 నుంచి ఈ కొత్త విదానానికి శ్రీకారం చుట్టనుండగా ఇప్పటికే క్షేత్ర సహాయకులకు శిక్షణ ఇస్తున్నారు.

ప్రస్తుతం ఉపాధిహామీ కూలీ పనుల్లో ఒకరికి బదులు మరొకరు వెళ్లి వేతనాలు పొందినట్లు అనేక సామాజిక తనిఖీల్లో బయటపడింది. కొన్ని సందర్భాల్లో నిధులను రికవరీ కూడా చేశారు. మరికొన్ని గ్రామాల్లో ప్రజా ప్రతినిధుల బంధువులు, క్షేత్ర సహాయకుల కుటుంబ సభ్యులు ఉపాధి హామీ పనులకు వెళ్లినట్లు హాజరు నమోదు చేస్తున్నారు. ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త యాప్ (ఎన్ఎంఎంఎస్)ను తీసుకొచ్చింది. ఈ యాప్‌ను కూడా కొందరు దుర్వినియోగం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో కొత్త విధానానికి చర్యలు చేపట్టారు. గతంలోకూలీలు పని చేయకున్నా క్షేత్ర సహాయకులు ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేసినట్లు అధికారుల దృష్టికి వచ్చింది. దీన్ని కట్టడి చేసేందుకు ప్రభుత్వం ఈకేవైసీ విధానాన్ని అమల్లోకి తీసుకొస్తోంది. ఈ విధానంతో నకిలీ హాజరు అవకాశం ఉండకపోగా వేతనాల చెల్లింపులోనూ పూర్తి పారదర్శకతకు అవకాశం ఉంది.

ఇసుక అక్రమ రవాణాపై కేసు నమోదు

మంథనిరూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నాల గ్రామ శివారులోని మల్లయ్య ఇటుక బట్టీలో అక్రమంగా నిల్వచేసిన ఇసుకను తరలించడానికి ప్రయత్నించిన వారిపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ రమేష్ శుక్రవారం తెలిపారు. గోదావరినది నుంచి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇటుకల బట్టీకి తరలించి అక్కడినుంచి జేసీబీ సహాయంతో రెండు టిప్పర్లలో ఇసుకను జగిత్యాలకు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు గురువారం రాత్రి పట్టుకున్నట్లు తెలిపారు. జేసీబీ, టిప్పర్లను, ఇసుక డంప్ సీజ్‌చేసి వాసం సతీష్, ముస్కే రాజుకుమార్, ఎర్రం సంతోష్, తనుగుల మహేష్, తన్నీరు మల్లిఖార్జున్, పొట్ల రాజ్‌కుమార్, పొయ్యాల భాస్కర్, పిక్కల మల్లయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో వృక్ష రక్షా బంధన్



కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ ధన్గర్‌వాడి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం వినూత్నంగా చేపట్టిన వృక్ష రక్షా బంధన్‌కు విద్యార్థినుల నుంచి స్పందన లభించింది. వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో హెచ్‌ఎంగా పని చేసిన ప్రమోద ఆలోచనలతో 16 సంవత్స రాలుగా కార్యక్రమం కొనసాగుతోంది. నీతూకుమారి కలెక్టర్‌గా ఉన్న రోజుల్లో ఆమె ఈ వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రమోద మాట్లాడుతూ వృక్షాన్ని అన్నదమ్ములుగా భావించి రాఖీ కట్టి రక్షిస్తే నీడను, ఆక్సిజన్, ఆహారాన్ని అందిస్తుందనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. పర్యావరణాన్ని కాపాడితే అది మనల్ని కాపాడుతుందన్నారు.

చెట్లకు రాఖీ కడుతున్న విద్యార్థినులు

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజ రాజేశ్వరస్వామి ఆలయం శుక్రవారం భక్తుల రద్దీతో సందడిగా మా రింది. భక్తులు ప్రవిత్ర స్నానాలు ఆచరించి కల్యాణ కట్టలో తల నీలాలు సమర్పించుకున్నారు. ధర్మదర్శనం, కోడె మొక్కు, శీఘ్ర దర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకు న్న భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి మొక్కులను చెల్లించుకు న్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో రాధాబాయి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.



బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

ఆలయంలో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు..

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొనడంతో బాంబ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయ ప్రాంగణంలో, ఆవరణతో పాటు పలు విభా గాల్లో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



మహాలక్ష్మి దేవాలయంలో మహిళలు కుంకుమ పూజలు

ధర్మపురి క్షేత్రంలో శ్రావణ సందడి

ధర్మపురి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం పురస్క రించుకుని ధర్మపురి క్షేత్రంలో శుక్రవారం భక్త జన సందడి నెలకొంది. వరలక్ష్మి శుక్రవారం కూడా కావడంతో అనేక మంది భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. గోదావరి నదీ తీరాన గల సంతోషీమాత, మహాలక్ష్మి, వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయాల్లో ఉపావాస దీక్షతో ఉన్న మహి ళలు ఉద్యాపన పూజలు, కుంకుమ పూజలు జరిపారు. ఆలయ అర్చకులు కొరిడె బాలక్రిష్ణ, మధ్వాచారి రాధికాపవన్ అమ్మ వారలకు ప్రత్యేక పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహిం చారు. శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల యాగ శాల వద్ద ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసా చార్యులు ఆధ్వర్యంలో అర్చకులు మోహనాచార్యా, విజయ్ లక్ష్మీ హవనం నిర్వహించారు. అనేక మంది భక్తులు అమ్మవారలతో పాటు లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఆలయాల్లో స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీం దర్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేశ్‌శర్మ పాల్గొన్నారు.



గోదావరిలో భక్తుల పుణ్యస్నానాలు

ఆదివాసీ జీవన చిత్రాలు

- ఫొటోగ్రఫీలో సిగ్మా శేఖర్ అంతర్జాతీయ ఖ్యాతి
- వెయ్యికు పైగా అవార్డులు.. 100 అంతర్జాతీయ అవార్డులు..
- నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)





అడవితోనే జీవనం, ప్రత్యేకమైన వస్త్రధారణ, అటవీ సంపద, పోడు వ్యవసాయం జీవనాధారంగా మానవ జాతికి ఆనవాళ్లుగా ఆదివాసీలు, గిరిజనులు జీవనం సాగి స్తున్నారు. అమాయకత్వమే వారి అభరణం.. మూగ జీవా లు వారి నేస్తాలుగా ఇంకా అనేక ప్రాంతాల్లో విద్య, వైద్యం, తాగునీరు, రోడ్ల వంటి మౌలిక సదుపాయాలు లేక జీవనం సాగిస్తున్నారు. అడవుల్లో వాగులు, కొండలు, పచ్చని ప్రకృతి ఒడిలో సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను వీడకుం డా జీవనం సాగిస్తున్న ఆదివాసీ గిరిజనుల బతుకు చిత్రా లను తన కెమెరాలో బంధించిన సిరి సిల్లకు చెందిన అంత ర్జాతీయ ఫొటోగ్రాఫర్ ఎంసీ శేఖర్‌పై శనివారం ఆదివాసీ దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..





ఆదివాసీ, గిరిజనుల బతుకు చిత్రాలు..

దేశంలోని వివిధ ప్రాం తాల్లో ఆదివాసీ, గిరిజను ల జీవన శైలిని, వారి బతు కు చిత్రాలను కెమెరాలో బంధిస్తూ ఫొటోగ్ర ఫీ రంగంలో శేఖర్ అం తర్జాతీ య స్థాయి లో ఎన్నో అవా ర్డులను అందుకు న్నారు. సిరిసిల్లలో సిగ్మా ఫొటోస్టూడియోతో ఛాయాచిత్ర రంగంలో అడుగుపెట్టిన మేర్గు శేఖర్ అంతర్జాతీయ స్థాయిలో అనేక అవార్డులను అందుకోవ డంతోపాటు పలు దేశాల్లో ఫొటోప్రదర్శనలు నిర్వహించారు. సిగ్మా పేరే శేఖర్‌కు సిరిసిల్లలో ఇంటి పేరుగా మారిపోయింది.

ఇప్పుడు సిగ్మా అకాడమి స్థాపించి ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లకు శిక్షణ ఇస్తూ వారి ఎదుగుదలకు తోడ్పడుతున్నారు. ఫొటోగ్రఫీ రంగంలో 1992 నుంచి 2024 వరకు పలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవార్డులు అందుకున్నారు. 1000కి పైగా అవార్డులు, 100 అంతర్జాతీయ పుర స్కారాలను, 300 మెరిట్ సర్టిఫికెట్‌లను అందుకున్నారు. సిగ్మా ద్వారా 200 పైగా వర్క్ షాప్‌లు నిర్వహించారు. ఢిల్లీ నగ రంతో పాటు అనేక ప్రాంతాల్లో శేఖర్ విభి న్నంగా తీసిన దాదాపు 1650 ఫొటోలతో ఎగ్జిబిషన్లు నిర్వహించారు.



శేఖర్ (ఫైల్)

పత్తిలో కలుపు మందు పిచికారికి ప్రత్యేక ఏర్పాట్లు

పాలకుర్తి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని కన్నాల గ్రామంలోని రైతులు పత్తిలో కలుపు మందు పిచికారి చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ విధానంతో పత్తి మొక్కలపై కలుపు మందు పడకుండా కలుపు మొక్కల నివారణ జరుగుతుందని ఏఈవో శశిధర్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రత్యేక పరికరం వాడు తున్న రైతులతో మాట్లాడుతూ పత్తి విత్తిన 20 నుంచి 60 రోజుల వరకు చేను లో కలుపు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాగళ్లతో గాని, కూలీల సహాయంతోగాని 60 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకున్నట్లయితే పత్తి ఏపుగా పెరుగుతుందన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పరికరంతో పత్తి మొక్కలపై గడ్డి మందు పడకుండా పిచికారీ చేసుకోవచ్చ న్నారు. కలుపు ఉండడం వల్ల పత్తి మొక్క లకు వేసిన రసాయన ఎరువులు ఆ మొక్క లకే పోతాయన్నారు. రైతులు సట్ల కనుక య్య, సముద్రాల పోచయ్య, మొం డయ్య, సాయిలు, బాదావత్ తిరుపతి పాల్గొన్నారు.



ప్రత్యేక పరికరంపై అవగాహన కల్పిస్తున్న ఏఈఓ శశిధర్

సిట్ విచారణకు హాజరైన బీజేపీ నాయకులు



కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో పాటు సిట్ విచారణకు హాజరవుతున్న పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు

భగత్‌నగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్‌లో సిట్ విచార ణకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు శుక్రవారం హైదరాబాద్‌లో హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రావు మాట్లా డుతూ ఫోన్ ట్యాపింగ్ విషయంలో విచారణ నిమిత్తం పోలీసులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చామన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభు త్వం తన ఫోన్ ట్యాప్ చేయడం దుర్మార్గమన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నెలల తరబడి సాగ దీస్తుందన్నారు. ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ విచారణ జరిపించే విడిచి పెట్టేది లేదని స్పష్టం చేశారు.

ముగిసిన టేబుల్ టెన్నిస్ పోటీలు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్‌ఈ క్లస్టర్-7 బాలికల టేబుల్ టెన్నిస్ పోటీలు కొత్తపల్లి ఆల్ఫోర్స్ పాఠశాలలో శుక్రవారం ముగిసాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ర్టాల నుంచి 500 మంది క్రీడా కారులు ఈ పోటీలలో పాల్గొని ప్రతిభ చాటారు. టీఎం ఈవెంట్ అండర్-14 విభాగంలో వీపీఎస్ పబ్లిక్ స్కూలు (విజయవాడ) ప్రథమ స్థానం, టైం స్కూలు(రంగారెడ్డి) ద్వితీయ స్థానం సాధించాయి. అండర్-17 విభాగంలో శ్రీప్రకాష్ స్కూల్ (తూర్పు గోదావరి) ప్రథమస్థానం, సర్ సీఆర్ స్కూల్(పెద్దాపురం, పశ్చిమ గోదావరి) ద్వితీయ స్థానం, అండర్-19 విభాగంలో శ్రీప్రకాశ్ స్కూలు (తూర్పుగోదావరి)ప్రథమస్థానం, సర్ సీఆర్ రెడ్డి స్కూల్ (పెద్దాపురం, పశ్చిమగోదావరి) ద్వితీయ స్థానాలు సాధించాయి.

వ్యక్తిగత విభాగంలో అండర్-14లో శీలం మనస్వి ప్రథమ స్థానం, అండర్-17 విభాగంలో ఎం. శాంతిజ్యోతి ప్రథమ, అండర్-19 విభాగం లో ఎం.దర్శిక ప్రథమ స్థానం సాధించారు. ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక అభి వృద్ధి లభిస్తుందన్నారు. క్రీడలు ఒత్తిడి నుంచి తట్టుకునే శక్తిని అంది స్తాయన్నారు. క్రీడల్లో రాణించినవారు, చదువులోనూ ముందుంటా రన్నారు. ఈ కార్యక్రమంలో పోటీల పరిశీలకులు పద్మారావు, చీఫ్ రెఫరీ శంకర్, అసోసియేట్ రెఫరీ రాంచంద్రారావు, అంపైర్లు బాబు రావు, ఒతినేలు, ఎండీ గౌస్, రామ్మూర్తి, రవి, గంగారాం, పాఠశాలల కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.



సీబీఎస్‌ఈ టేబుల్ టెన్నిస్ పోటీల విజేతలతో అతిథులు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు.

సీబీఎస్‌ఈ క్లస్టర్-7 బాలికల టేబుల్ టెన్నిస్ పోటీలలో గెలు పొం దిన విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో ఎస్.మనస్వి, రిద్దిటోరో, కె.నైనా, వంశిక, అండర్-17 విభాగంలో జి.వర్షిక, ఎస్. తనిష్క, ఎం.దాస్, మిద్ది శాంతి జ్యోతి, అండర్-19 విభాగంలో టి.సాయిసుదీక్ష, కె. రిషికాతులసి, ఎం. మాం డవ లినేషియా, ఎం.దర్శిక ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు.

సమసమాజ స్థాపనకు గద్దర్ అలుపెరగని కృషి

తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్

హుజూరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సమసమాజ స్థాపనకు ప్రజా యుద్ధనౌక గద్దర్ అలు పెరగని కృషిచేశారని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్ లో శనిగరం బాబ్జి ఆధ్వర్యంలో గద్దర్ ద్వితీయ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా వెన్నెల గద్దర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. అనంతరం గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి సిటీ సెంట్రల్‌హాల్ వరకు ర్యాలీగా వచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లా డుతూ తెలంగాణ ప్రాంత ప్రజల విముక్తి కోసం తూటాను మోసిన ప్రజా యుద్ధనౌక గద్దర్ అన్నారు. గద్దర్ ఆశ, ఆశయం సమ సమాజ నిర్మాణం స్వేచ్ఛ, సమానత్వం పోరా టాలు చేశారన్నారు. ఉస్మానియా యూని వర్సిటీ విద్యార్థి నుంచి జన నాట్య మండలి సాంస్కృతిక సేనానిగా పాటను ఆయుధంగా ఎక్కుపెట్టి ప్రజా ఉద్యమాలు జరిపారన్నారు. కారంచేడు హత్యాకాండ జరిగిన పృుడు దళితులకు ధిక్కారం నూరిపోశారన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్

జీవితమంతా ప్రజా పోరాటాల్లో గడిపి న గద్దర్‌ను 75ఏళ్ల వయసు వర కు 32 పోలీసు కేసులు వెంటాడా యన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమా న్ని గద్దర్ తన పాటా, ఆటలతో ఉర్రూతలూగించిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. నిత్యం ప్రజాపోరా టాలతో ముందుకు సాగిన ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సభలో కళాకారులు పాడిన పాటలు ఆహూ తుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. సమావేశంలో ఆవునూరి సమ్మయ్య, ముక్కెర రాజు, జీడీ సార య్య, బండ శ్రీనివాస్, మురళీ మధు, రాములు, తిరుపతయ్య, కళాకారులు, కవులు, మేధావులు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం..



ఆయిల్‌పామ్ పంటను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వీర్నపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ పంటతో రైతులకు అధిక ఆదాయం వస్తుందని వీర్నపల్లి వ్యవసాయ విస్తరణ అధికారి ఫజిల్ అన్నారు. వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో రైతు పెంచ్యాల నర్సింగం ఆయిల్‌పామ్ పంట మొద టి దిగుబడి రావడంతో అధికారులు, రైతులు శుక్రవారం పరిశీ లించారు. జిల్లాలోనే మొదటిసారి ఆయిల్‌పామ్ పంట కోతకు వచ్చిం దన్నారు. మొద టిదశలో సుమారు 4 క్వింటాళ్ల పంట దిగుబడి వచ్చినట్లు ఏఈవో తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుతో ఆర్థిక ఎదుగుదల అధిక మవుతుందని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ పంటకు ప్రస్తుతం మార్కెట్లో టన్నుకు రూ.18,500 ధర ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్, ఆయిల్ పామ్ క్లస్టర్ అధికారి పవన్, ఏఎంసీ డైరెక్టర్లు చంద్రమౌళి, నరేష్, రైతులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద

ప్రాజెక్టులోకి 5,062 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శుక్రవారం 5,062 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరి నీరు ప్రాజెక్టులోకి వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 40.304 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 5,983 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇందులో కాకతీయ కాలువకు 2,350 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 113 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 240 క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 112 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 225 క్యూసెక్కులు, వరద కాలువకు 2,250 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 462 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వ్యయం అవుతోంది. ఇదిలా ఉండగా జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 31.859 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 4.343 టీఎంసీల నీరును వ్యయం చేశారు.

నోరూరిస్తున్న పిండి వంటలు..

వరుస పండుగలు... శుభకార్యాలు

తయారీదారులకు పెరిగిన గిరాకీ



అమ్మకానికి సిద్ధంగా ఉన్న గారెలు, మురుకులు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం సందర్భంగా ఈ ఆగస్టు మాసంలో వరుసగా పండు గలతో పాటు (వరలక్ష్మీవ్రతం, రాఖీపౌర్ణమి, శ్రీకృష్ణాష్టమి, వినాయకచవితి) శుభకార్యాల జోరు ఊపందుకుంది. ఇందు కు ఎన్ని పదార్థాలు వడ్డించినా పిండి వంటలు రుచి చూపా ల్సిందే! పిల్లలు, పెద్దలు సైతం తినుబండారాలకు దాసులే! పిల్లలకైతే స్నాక్స్ రూపంలో కూడా ఉపయోగపడుతాయి. ఇతర ప్రదేశాలకు టూర్ వెళ్లే వారికి కూడా బాగా పనికి వస్తాయి. దీనికి జిల్లా వాసులు శ్రమ లేకుండా పలు షాపుల్లో, హోం ఫుడ్ సెంటర్లలో తయారైన పిండి వంటలను, పలు పచ్చళ్లను ఆశ్రయిస్తున్నారు. అందు బాటులో ధరలకే వంటకాలను అందిస్తుం డటంతో అటు తయారీ దారులకు గిరాకీ పెరుగుతోంది. చేయి తిరిగిన మనుషులతో శుభ్రమైన పదార్థాలు ఏ రోజుకారోజు తయా రీ చేసి విక్రయిస్తున్నారు. మరో వైపు విదేశా ల్లో ఉన్న తమ వారికి ప్యాకింగ్ చేసి కూడా పంపుతు న్నారు. సుమారు 50కి పైగా తీయని, కారపు వంట కాలు అమ్ము తుండగా వినియోగదారులు కిలోల చొప్పున తీసుకుంటున్నా రు. చిప్స్ మొదలు అప్పాల వరకు, గవ్వలు మొదలు లడ్డూల వరకు వివిధ సైజుల్లో అమ్ముతున్నారు. వెరైటీని బట్టి కిలోకు ఒక్కో పిండి వంటకం కనిష్ట ధర రూ.280 నుంచి గరిష్ట ధర రూ.350 వరకు పలుకుతున్నాయి.

ఉధృతంగా పల్వంచ వాగు

గంభీరావుపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కు కామారెడ్డి జిల్లాలోని పల్వంచ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో గంభీ రావుపేట మండలంలోని నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టులోకి వరద నీరు భారీగా వస్తోంది. మానేరు జలాశయం నీటి మట్టం రోజు రోజుకు పెరుగుతోంది. శుక్రవారం నాటికి ఎగువ మానేరు నీటి మట్టం 23 ఫీట్లకు చేరింది. మానేరు పూర్తిగా నిండేం దుకు మరో 8 ఫీట్ల నీరు కావల్సింది ఉంది. మానేరు నిండుతుండటంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.



ఏఎంసీ కార్యదర్శిని కలిసిన వ్యాపారులు

జగిత్యాలఅర్బన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన బి. శ్రీనివాస్ రావును శుక్రవారం జగిత్యాల మ్యాంగో ట్రేడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అమీన్ ఆధ్వర్యంలో వ్యాపారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం మార్కెట్‌లోని పలు సమస్యలలను వ్యాపారులు కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్ళగా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మ్యాంగో ట్రేడర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విరాళాలతో రోడ్డు మరమ్మతు

కథలాపూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూషణ రావుపేట నుంచి నిజామాబాద్ జిల్లా కోనాపూర్‌కు వెళ్ళే దారి అధ్వాన్నంగా మారడంతో గ్రామస్థులు విరాళాలు పోగుచేసుకుని బాగు చేసుకున్నారు. ప్రతీ దినం ఈ రోడ్డుపై వివిధ పనుల నిమిత్తం వ్యాపారులు, రైతులు, ఉపాధ్యాయులు ప్రయాణం చేస్తుండగా ఇటీవల కురిసిన చిన్నపాటి ముసురుకే చిత్తడిగా మారి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఈ నేపథ్యంలో అటు కోనాపూర్, ఇటు భూషణరావుపేట గ్రామస్థులు శుక్రవారం విరాళాలు వేసుకుని ట్రాక్టర్, జేసీబీలతో రోడ్డుపై మొరం పోసి చదును చేశారు. దీంతో ప్రయాణీకులకు రాకపోకలు సాగించడానికి మార్గం సుగమమైంది.

నిబంధనల మేరకు ఇంటి నిర్మాణం చేపట్టాలి

రాయికల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్ అన్నారు. రాయికల్ పట్టణంలోని 10, 12 వార్డుల లో, మండలంలోని వీరాపూర్, కొత్తపేట గ్రామాల్లో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మున్సిపల్ వార్డు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు అవగాహన కల్పించి ఇంటి నిర్మాణం చేపట్టేలా సూచనలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వెంకటి, మున్సిపల్‌వార్డు అధికారులు రజాక్, గంగారెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బాపురపు నర్సయ్య, మచ్చ శేఖర్, బాపురపు రాజీవ్, కొత్తపెల్లి గోపాల్, కడకుంట్ల నరేష్, బత్తిని నాగరాజు, కాటిపెల్లి రాజశేఖర్, చింతలపెల్లి గంగారెడ్డి, సోమ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి స్వర్ణ, నాయకులు శివ, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ

బీర్‌పూర్,ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం ఆయా గ్రామాలకు చెందిన మండల నాయకులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మణాల కోసం ముగ్గులు పోసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నారపాక రమేష్, నల్ల మహిపాల్‌రెడ్డి, చుంచు నరేందర్, ఎలగందుల అశోక్, పర్వతం రమేష్, గుడిసె జితేందర్ యాదవ్ పాల్గొన్నారు.

వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు

జగిత్యాల క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):జగిత్యాల జిల్లా కేంద్రంలో శ్రావణ మాస శుక్రవారాన్ని పురస్కరించుకుని మహిళలు వరలక్ష్మి వ్రతాలను శుక్రవారం వైభవంగా జరుపు కున్నారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి. ప్రధాన కూరగాయల మార్కెట్‌లో వేకువజాము నుంచే భక్తులు పూజ సామాగ్రి కొనుగోలు చేశారు. అనంతరం మహిళలు తమ ఇళ్లలో భక్తి శ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాలు నిర్వహించి ముత్తైదువులకు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. అభయాంజనేయ స్వామి, అష్టలక్ష్మీ, మార్కం డేయ, వాసవీ దేవాలయాల్లో భక్తులు సామూహిక కుంకుమ పూజలు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత తదితరులు ఉన్నారు.

●**మెట్‌పల్లిటౌన్:** పట్టణంలోని త్రిశక్తి ఆలయంతో పాటు పలు ఆలయలలో శ్రావణ శుక్రవారం పురష్కరించుకోని మహిళలు వరలక్ష్మీ వ్రతాలు వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా మహిళలు ఆలయలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక వ్రతాలలో పాల్గొని వాయినాలు ఇచ్చారు. అర్చన, అభిషేకలు నిర్వహించారు. మహిళలు పసుపు, కుంకుమ, పూలు, పండ్లు వాయినం ఇచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

●**రాయికల్:** రాయికల్ పట్టణంలోని శ్రీశ్రీశ్రీ లలితాంబికా శక్తి పీఠంతో పాటు వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం, అయ్యప్ప ఆలయాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీ వరలక్ష్మీ వ్రత మహోత్సవం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలను మహిళలు ఘనంగా జరుపు కున్నారు. శ్రీవిద్య ఉపాసకులు, శక్తిపీఠ స్థాపకులు సద్గురు శ్రీ రామకృష్ణ గురూజీ మాతాజీ ఆధ్వర్యంలో మహోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం శ్రీ లలితా మాతకు 108 మంత్ర జల కలశాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు గంగాధర్, సురతాని భాగ్యలక్ష్మి, అనిల్, పద్మ, భక్తులు పాల్గొన్నారు.

●**కోరుట్ల:** శ్రావణ మాసం వేడుకలు పురస్కరించుకోని పట్టణంలోని పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని కాల్వగడ్డ ప్రాంతంలోని శ్రీ రామేశ్వరాలయం, ఆదర్శనగర్‌లోని అష్ట లక్ష్మి దేవాలయాలలో సామూహిక సత్యనారాయణ వత్రాలు నిర్వహించంగా మహిళలు అధిక సంఖ్యలో పూజలలో పాల్గొన్నారు. రామేశ్వరాలయంలో వేదపండితుడు పాలెపు రాజేశ్వర శర్మ అష్టలక్ష్మి దేవాయలంలో అలయ అర్చకులు ఇందూరి మధుసూదనా చారీ, పెరుంబదూరి శ్రీనివాస చార్య మత్రోత్చరణ మధ్య ప్రత్యేక పూజలను నిర్వహించారు. వరలక్ష్మి వత్రంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.




పెగడపల్లిలో, కథలాపూర్ మండలం భూషణరావుపేట మర్రవ్వ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

●**సారంగాపూర్:** శ్రావణమాసం పర్వదినాన్ని పురష్కరించుకుని శుక్రవారం మండంలోని పోతారం మహలక్ష్మీ ఆలయంలో భక్తి శ్రద్దలతో మహిళలు వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం, కుంకుమ పూజల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

●**బీర్‌పూర్:** బీర్‌పూర్ మండలంలోని పలు ఆలయాలలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు భారీ సంఖ్యలో ఆలయాల వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బీర్‌పూర్ మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో, తుంగూర్ వేణుగోపాల స్వామి ఆలయంలో, కొల్వాయి రామలయంలో శ్రావణ పౌర్ణమిని పురష్కరించుకొని ప్రత్యేక పూజలు, వరలక్ష్మీ వ్రతాలు చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పెద్ద సంతోష్, చిన్న సంతోష్, మధు కుమార్, ఆలయాల సిబ్బంది పాల్గొన్నారు.

●**కథలాపూర్:** శ్రావణ మాసం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో శుక్ర వారం మహిళలు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వరలక్ష్మీ వ్రతాలు చేసి వాయినాలు ఇచ్చి పుచ్చు కున్నారు. భూషణరావుపేట మర్రవ్వ ఆల యంలో మహిళలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిం చారు. అలయ అర్చకులు అర్చనలు, అభిషేకాలు చేశారు.

●**మల్లాపూర్:** శ్రావణ మాసం రెండవ శుక్రవారం సందర్భంగా గ్రామాల్లోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. మల్లాపూర్‌తో పాటు ఆయా గ్రామాల్లో మహిళలు వరలక్ష్మి వ్రతం శుక్రవారం ఆచరించారు. వాసవి మాత, కనుకదుర్గ ఆలయాలతో పాటు వివిధ దేవాలయాల్లో మహిళలు అమ్మ వారికి అభిషేకం, అర్చన నిర్వహించారు. ఓడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సామూహిక కుంకుమ పూజలు అర్చకులు మహిళలచే భక్తి శ్రద్ధలతో జరిపించారు.

●**పెగడపల్లి:** పెగడపల్లి మండలంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం వేడుకలలో భాగంగా మహిళలు తమ ఇండ్లలో వ్రత వేడుకలు నిర్వహించుకోవడంతో పాటు మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం, మండలం లోని పలు గ్రామాలలోని రామాలయాలు, శివాలయాలలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయంలో లలితా పారాయణం గ్రూపు మహిళలు పారాయణం నిర్వహించారు. ఒకరికొకరు వ్రత వాయినాలు, పసుపు కుంకుమ, గాజులు, పూలు, పండ్లు అందజేశారు.

●**కొడిమ్యాల:** కొడిమ్యాల మండలంలోని వివిధ గ్రామాల్లోని మహిళలు శ్రావణ మాసంలోని మూడవ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను వైభవంగా జరుపుకొని భక్తి ప్రపత్తులను చాటుకున్నారు.

ఇళ్ళలో వరలక్ష్మీ దేవిని నిలుపుకొని ముత్తయిదువలకు తీపి వంటలను, పండ్లు, ఫలహారం పంపిణీ చేశారు. నిండు నూరేళ్ళు సౌభాగ్యవతిగా ఉండాలని వరలక్ష్మీదేవి వ్రతాలు చేసుకున్న వారిని ముత్తయిదలు ఆశీర్వదించారు.

‘బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్’

జగిత్యాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చిందని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. సామాజిక న్యాయం కోసం రాష్ట్రపతిని కలిసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తే సమయం ఇవ్వకపోవడం దురదృష్టకరమని అన్నారు. శుక్రవారం జగిత్యాల పట్టణంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిసి రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం ఆర్డినెన్స్ గవర్నర్‌కు పంపించి 4 నెలలు గడుస్తుందన్నారు. సెప్టెంబర్‌లోగా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల నిర్వహణ జాప్యం జరిగితే కేంద్రం నుంచి వచ్చే 15 వందల కోట్ల రూపాయలు నష్టపోయే ప్రమాదం ఉన్నదని అన్నారు. స్థానిక సంస్థల్లో విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉందన్నారు. ప్రజాస్వామ్య బద్దంగా ఎన్నికైన సిఎం రేవంత్ రెడ్డి రాష్ట్రపతిని కలిసేందుకు అనుమతించక పోవడం నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను అవమానించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం భారతదేశంలో భాగమా కాదా చెప్పాలని డిమాండ్ చేశారు. ఇందిరా సహాని కేసు 50 శాతం మించకూడదని చెప్పినా 50 శాతం రిజర్వేషన్ సీలింగ్ తెలంగాణ రాష్ట్రంలో గతంలో నుండే 29 శాతం బిసీ, 15 శాతం ఎస్సీ 10 శాతం ఎస్టీ మొత్తం 54 శాతం అమలు చేశారని, ప్రత్యేక పరిస్థితుల్లో 50 శాతం మించవచ్చని స్పష్టంగా పేర్కొన్నారన్నారు. తమిళనాడులో 69 శాతం అమలు చేస్తున్నారన్నారు. తెలంగాణలో కూడా 9 వ షెడ్యూల్‌లో చేర్చి 42 శాతం బీసీ రిజర్వేషన్‌లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలకు అనుగుణంగా సర్పంచుల ఎన్నికలు జరిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గాజంగి నందయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గాజుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మాక్ పోలింగ్

కోరుట్ల, ఆగస్టు(ఆంధ్రజ్యోతి) 8: పట్టణంలోని గౌతమ్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కరస్పాండెంట్ ఎంఏ గఫార్ అధ్వర్యంలో విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాక్ పోలింగ్, బ్యాలెట్, నామినేషన్‌పై అవగాహన కల్పించారు. పాఠశాలలో వివిధ విభాగాలలో విద్యార్థులు నామినేషన్ దాఖలు చేసి పోటీలో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు ఎన్నికల అధికారులగా వ్యవహరించి పోలింగ్‌ను నిర్వహించారు. ఓట్ల లెక్కింపు చేసి విజేతను ప్రకటించారు.

ఈ సందర్భంగా ప్రజాస్వామ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రెసిడెంట్ ఎంఏ కిజర్, సెక్రటరి ఎంఏ అఫ్రోజ్, ప్రిన్సిపాల్ గోపి మారాసీలతో పాటు పలువురు పాల్గొన్నారు.

పైసలిస్తేనే పని..

(5వ పేజీ తరువాయి)

ఓవర్ లోడ్ వెహికల్స్, జరిమానాల పేరిట అదనంగా గుంజుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

● **టిప్పర్, ట్రాక్టర్ యజమానుల నెలవారీ మామూళ్లు**

జిల్లాలో ఇసుక, మొరం, కంకర, గ్రానైట్ రవాణా చేసే లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు పెద్ద సంఖ్యలో తిరుగుతున్నాయి. లారీలు ఓవర్ లోడ్‌తో ప్రయాణిస్తున్నందున రోడ్లు దెబ్బతినడంతో పాటు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వీటిని నివారించేందుకు అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించాలి. కానీ లారీ, టిప్పర్, ట్రాక్టర్ యజమానుల నుంచి నెలవారీ మాముళ్లు తీసుకొని ఆర్టీఏ అధికారులు నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఫలితంగా ప్రభుత్వ ఖజానాపై భారం పడుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి ఆర్‌టీఏ కార్యాలయంలో అవినీతిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

భూ భారతి దరఖాస్తులను పరిష్కరించాలి



రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ లత

బీర్‌పూర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): భూ భారతిలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత అన్నారు. శుక్రవారం బీర్‌పూర్ మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూ భారతి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ భూమి, పట్టా భూమి, అటవీ భూమి, విరాసత్ ల కోసం వచ్చిన దరఖాస్తుల విధంగా వేరు వేరు చేసి మోకా మీదికి వెళ్లి పరిశీలించి సమస్యలు వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుజాత, డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

●ఇబ్రహీంపట్నం: భూభారతిలో వచ్చిన దరఖాస్తులను ఆగస్టు 14లోపు పరిష్కరించాలని ఆర్డీవో శ్రీనివాస్ సూచించారు. ఇబ్రహీంపట్నంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూభారతిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, మండలంలోని ఆర్ఐలకు ఒక్కొక్కరికి ఎన్ని గ్రామాలు ఉన్నాయి, ఎన్ని దరఖాస్తులు వచ్చాయని వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల14 లోపు భూభారతి దరఖాస్తులన్నిటిని పరిష్కరించాలని ఆర్డీవో శ్రీనివాస్ ఆదేశించారు.

ఇబ్రహీంపట్నం మండలంలో మొత్తం 1,466 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. అందులో 34 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో పరిష్కారం కోసం ఆర్డీవో కార్యాలయానికి వచ్చాయన్నారు. అలాగే గ్రామాల్లో వచ్చిన దరఖాస్తుల వివరాలను ఆయా గ్రామాల గ్రామపంచాయతీ కార్యాలయాల్లో నోటీసులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వరప్రసాద్, డిప్యూటీ తహసిల్దార్ ప్రసాద్, ఆర్ఐలు రేవంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వినతి

భీమారం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెగూడెం గ్రామానికి చెందిన బొల్లెజి కిషన్ ఇటీవల ఓమన్ దేశంలో మృతి చెందాడు. అయితే మృతుని కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా, ఓమన్ కంపెనీ యాజమాన్యం నుంచి 8 నెలల జీతం బకాయిలు, 12 సంవత్సరాల ఉద్యోగం అనంతరం లభించే ప్రయోజనాలు ఇప్పించాలని మృతుని భార్య శంకరమ్మ, కుమారుడు రాజ్ కుమార్‌లు హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ ప్రభుత్వ నియమిత ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, మెంబర్ సింగిరెడ్డి నరేష్ రెడ్డిలు మృతుని కుటుంబానికి మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమంలో ఖతార్ ఇండియన్ ఎంబసీ ఆధ్వర్యంలో నడిచే ఇండియన్ కమ్యూనిటీ బెనివలెంట్ ఫోరం ప్రతినిధి ఖాజా నిజాముద్దీన్, డాక్టర్ అజయ్, భార్గవి, జీ. సురేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

కొడిమ్యాల, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాచుపల్లి గ్రామంలో కొడిమ్యాల సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు తల్లి ప్రేమలత మృతి చెందగా శుక్రవారం సాయంత్రం మృతురాలి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం, మైత్రి గ్రూప్ చైర్మన్ జయపాల్‌రెడ్డి పరామర్శించారు. అంతక ముందు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు నారాయణగౌడ్, ముత్యం శంకర్‌గౌడ్, అజయ్‌గౌడ్, అజయ్‌రెడ్డి, గోల్కొండ రాజు, కిషన్‌రెడ్డి, శంకర్‌గౌడ్, జలెందర్, కాంగ్రెస్ నాయకులు, పలువురు గ్రామ ప్రముఖులు ఉన్నారు.

●కొడిమ్యాల సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు తల్లి ప్రేమలత ఇటీవల దారుణ హత్యకు గురయ్యారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని నాచుపల్లి గ్రామంలో మైత్రి గ్రూప్ చైర్మన్ కొత్త జయపాల్‌రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నర్సింగరావును పరామర్శించారు. అనంతరం ప్రేమలత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మైత్రీ చానల్ ఎండీ సుజన్‌రావు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్, మిత్ర మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

జగిత్యాల అగ్రికల్చర్, ఆగష్టు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు విద్యార్థులు అలవర్చుకోవాలని జ్యోతి హై స్కూల్ డైరెక్టర్ బియాల హరిచరణ్‌రావు అన్నారు. పట్టణంలోని జ్యోతి హైస్కూల్ ఐఐటీ అకాడమీలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన స్టూడెంట్ కౌన్సిల్ ప్రమాణ స్వీకారం శుక్రవారం పాఠశాల ఆవరణలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ హరిచరణ్‌రావు స్కూల్ ఫ్లాగ్‌ను హోస్ట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ వారు నిర్వహించిన ఇంటర్నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలంపియాడ్‌లో అద్భుత ప్రదర్శనకు బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డుతో పాటు జాతీయ స్థాయిలో గోల్డెన్ స్కూల్‌గా నిలిచినందుకు మెమోంటో అందుకున్నట్లు పాఠశాల డైరెక్టర్ హరిచరణ్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్‌లు హరిచరణ్‌రావు, శ్రీధర్‌రావు, మౌనికరావు, అజిత పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ధర్మపురి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో పరిసరాల పరిశుభ్రత పాటించాలని డీఆర్‌డీవో రఘువరణ్ అన్నారు. ధర్మపురి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో వంట గదిని పరిశీలించారు. నిత్యావసర సరుకులు నాణ్యత గురించి ప్రత్యేక అధికారి అరుణను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. అనంతరం తుమ్మెనాల అటవీ ప్రాంతంలో చెక్ డ్యామ్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ధర్మపురి ఎంపీడీవో రవీందర్, ఈజీఎస్ ఏపీవో సుజన్, ప్రత్యేక అధికారి అరుణ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

మల్యాల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేటకు చెందిన బూస అంజయ్య ఇటీవల దుబాయిలో గుండెపోటుతో మృతి చెందగా మృతుని కుటుంబసభ్యులకు ముత్యంపేట ఎన్నారై వెల్ఫేర్ అసోసియోషన్ సభ్యులు శుక్రవారం రూ.10వేలు ఆర్థికసహాయం అందజేశారు. మర్రి మల్లేశం, బొమ్మకంటి మహేశ్, బాలే వంశీకృష్ణ, గుండేటి సంజీవ్, పంజాల మధు, పెరుమండ్ల శ్రీనివాస్, బాలే గణేశ్, జక్కని అఖిల్, పరమేశ్వర్ పాల్గొన్నారు. అలాగే స్థానిక ఫ్రెండ్స్ యూత్ అసోసియోషన్ ఆధ్వర్యంలో రూ.5వేల ఆర్థిక సహాయం అందించగా సయ్యద్, వెంకీ, కోగిల వంశీ, సామల సతీశ్, గంగధర అఖిల్, సాయిరాం పాల్గొన్నారు.

ముందస్తు రక్షాబంధన్ వేడుకలు

జగిత్యాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నవ్య బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం ముందస్తు రక్షా బంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రాఖీ పండుగ విశిష్టత వివరించి సీనియర్ ఇంటర్, జూనియర్ ఇంటర్ విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకున్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేశ్, ప్రిన్సిపాల్ గాలిపల్లి ఈశ్వర్ కుమార్, అధ్యాపకులు, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు శేఖర్, రాజేశ్, సాయిచంద్, శివ, పాల్గొన్నారు.



జ్యోతి స్కూల్‌లో 15 అడుగుల పొడవు గల రాఖీతో విద్యార్థులు

●**జగిత్యాల అగ్రికల్చర్:** పట్టణంలోని స్థానిక జ్యోతి హై స్కూల్ ఐఐటీ అకాడమీలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ప్రత్యేక ఆకర్షణగా విద్యార్థులు స్వయంగా తయారు చేసిన 15అడుగుల పొడవైన రాఖీని ప్రదర్శించగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బియాల హరిచరణ్‌రావు, శ్రీధర్‌రావు, మౌనికరావు, అజితరావు పాల్గొన్నారు.

●పట్టణంలోని స్థానిక మిషన్ కాంపౌండ్‌లో గల స్లేట్ హైస్కూల్‌లో శుక్రవారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రిన్సిపాల్ స్వప్న, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

●**కోరుట్ల:** పట్టణంలోని కేరళ ఇంగ్లీష్ మీడియ కరస్పాడెంట్ బారీ ఏర్వర్యంలో ఆర్‌డీఓ జీవాకర్ రెడ్డి, తహసిల్దార్ కృష్ణ చైతన్య, సిఐ సురేష్ బాబు, ఎస్ఐ చిరంజీవిలకు రాఖీలను కట్టి వేడుకలను నిర్వహించారు.

●కోరుట్ల మున్సిపల్‌లో స్వచ్ఛత బంధన్ స్వచ్ఛరాఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని బాలికల పాఠశాల విద్యార్థులు మున్సిపల్ అధికారులు సిబ్బందికి రాఖీని కట్టి వేడుకలను నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రవీందర్ మాట్లాడారు.

●**కోరుట్ల రూరల్:** మండలంలోని అన్ని గ్రామాలలో రక్షా బంధన్ వేడుకలను ఆర్ఎస్ఎస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు.

●**మెట్‌పల్లిటౌన్:** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో శుక్రవారం ఎబివిపి ఆధ్వర్యంలో రక్షబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎబివిపి కార్యదర్శి మంగళంపల్లి మారుతి, ఇబ్రహీంపట్నం మండల కన్వీనర్ జక్కం రామ్ చరణ్, కన్వీనర్ బండి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

●**రాయికల్:** రాయికల్ పట్టణానికి చెందిన ప్రగతి ఉన్నత పాఠశాల విద్యార్థులు రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రగతి ప్రిన్సిపాల్ బాలె శేఖర్, డైరెక్టర్ నిఖిల్ కుమార్, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

●పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్‌లు మచ్చ లలిత, విద్యాన్వేష్ పాల్గొన్నారు. పట్టణంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ వక్త అశోక్‌రావు, సభ్యులు రవీందర్, కుర్మ మల్లారెడ్డి పాల్గొన్నారు.

●పట్టణంలోని శ్రీ గ్రీన్ వుడ్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో డైరెక్టర్ కాకర శ్రీనివాస్ రెడ్డి, అకాడమీ డైరెక్టర్ యజ్ఞశ్రీ, అనిత తదితరులు పాల్గొన్నారు.

●**కథలాపూర్:** వైద్య సిబ్బందికి కథలాపూర్ మండలంలోని మాస్ట్రో పాఠశాల విద్యార్థినిలు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి సింధూజ, పాఠశాల కరస్పాండెంట్ ఆకుల రాజేశ్, ప్రిన్సిపాల్ ఆకుల రంజిత్, డైరెక్టర్ రాజేందర్, విద్యార్థినిలు ఉన్నారు.

●**మల్యాల:** మల్యాలలోని శ్రీవాగ్దేవి, ఎస్‌జీఆర్, కెరళ, రామన్నపేటలో గల సరస్వతి పాఠశాలల్లో శుక్రవారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రాఖీలు కట్టుకొగా సోదరభావానికి రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

దుబాయ్‌లో గుండెపోటుతో వ్యక్తి మృతి

భీమారం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రానికి చెందిన చెక్కపెల్లి గంగాధర్(55) ఈనెల 4వ తేదీన దుబాయ్‌లో గుండెపోటుతో మృతిచెందాడు. కుటుంబ ఆర్థికాభివృద్ధి కోసం విదేశంలో ఎన్నో కష్టాలు భరించి పని చేసిన ఆయన అనుకోని గుండెపోటు బారిన పడి ప్రాణాలు కోల్పోవడం కుటుంబాన్ని, గ్రామాన్ని శోకసంద్రంలో ముంచింది. గంగాధర్ మృతదేహం శుక్రవారం స్వగ్రామానికి చేరుకోగానే బంధుమిత్రులు, గ్రామస్థులు కన్నీటి పర్యతమై చివరి చూపు చూసుకున్నారు. ఇంత దూరం జీవితం పోరాటం చేసి, చివరికి స్వగ్రామ మట్టిలో కలవడం తప్పదా అనే వాక్యాలు అందరి నోట వినిపించాయి. గంగాధర్‌కు ఇద్దరు కుమార్తెలు. జీవితంలో అన్నీ తానై నిలిచిన పెద్ద కుమార్తె తన తండ్రి అంతిమ సంస్కారాలను నిర్వర్తించడం అక్కడ ఉన్నవారిని కదిలించింది. మాజీ మంత్రి జీవన్ రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ వొద్దినేని హరిచరణ్‌రావులు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు వేయించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ వరప్రసాద్

ఇబ్రహీంపట్నం, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 11న మండలంలో నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ వరప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం సంబంధిత శాఖల మండలస్థాయి అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ నెల 11 న జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమము ఉంటుందని మండలంలోని 1 నుండి 19 సంవత్సరాల వయసు గల పిల్లలు అందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేస్తారని దానికి సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు.మండల వైద్యాధికారి డాక్టర్ హరీష్ మాట్లాడుతూ అర్హులైన 1నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, కౌమారులకు అల్బెండజోల్ మాత్రలు వేయడం జరుగుతుందని. గ్రామాలలోని అంగన్వాడి కేంద్రంలో ఒకటి నుండి ఐదు సంవత్సరాల వయస్సు గల పిల్లలకు, డ్రాప్ అవుట్ అయిన పిల్లలకు అంగన్వాడి టీచర్ ఆల్బెండజోల్ మాత్రలు ఇస్తారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సలీం, సి హెచ్ ఓ విజయ భాస్కర్, కార్తిక్, తదితరులు పాల్గొన్నారు.

వరద కాలువ నీటికి గంగాహారతి

కథలాపూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : వరద కాలువకు నీటిని విడుదల చేసిన నేపథ్యంలో శుక్రవారం మండలంలోని పెగ్గెర్లలో కాంగ్రెస్ శ్రేణులు గంగాహారతి నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. వరద కాలువ పూర్తిగా ఎండిపోగా పంటల పరిస్థితి ప్రశ్నార్థకమైన క్రమంలో ఎమ్మెల్యే విప్ ఆది శ్రీనివాస్, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో మాట్లాడి నీటిని విడుదల చేయడం పట్ల హర్షం వెలిబుచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ కారపు గంగాధర్, విండో డైరెక్టర్ మార్గం శ్రీనివాస్, సీనియర్ నాయకులు లవ్‌కుమార్, గణేశ్, మోత్కూరి అంజాగౌడ్, చీర్గం రాజేశం, పొన్నం ప్రభు, శశిరెడ్డి, లక్ష్మణ్, వీరేందర్ ఉన్నారు.

ఇసుక డంప్‌ల వేలం

మెట్‌పల్లిరూరల్, ఆగస్టు 8(ఆంధ్ర జ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో పట్టుకున్న ఇసుక డంప్‌లకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ఉమేష్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో సీజ్‌చేసిన అక్రమఇసుక డంపులకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 12న వేలం పాట నిర్వహించడం జరుగుతుందని ఆర్ఐ ఉమేష్ ప్రకటనలో తెలి పారు. జగ్గసాగర్‌లో గ్రామశివారులోని మాన్‌పూర్ గేట్‌సమీపంలో 56ట్రిప్పులకు సోమవారం ఉదయం 10:30లకు, రామలచ్చక్కపేట శివారులోని వరుదకాలువ సమీపంలోని 28 ట్రిప్పులకు ఉదయం 11:30లకు, ఆత్మనగర్ గ్రామశివారులోని వరు దకాలువ సమీపంలో 236 ట్రిప్పులకు మధ్యాహ్నం 12:30లకు, ఆత్మనగర్ గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిల్వచేసిన 63 ట్రాక్టర్ల టిప్పుల డంపులకు మధ్యాహ్నం 1 :30లకు వేలం పాట నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తిఉన్న వారు నిర్ణహించిన సమయంలోపు రూ.10వేలను మెట్‌పల్లి ఆర్ఐ-2కు సమర్పించి వేలంపాటలో పాల్గొనలని ప్రకటన ద్వారా తెలిపారు.

స్వర్ణకార సంఘం కార్యవర్గం

కోరుట్ల, అగస్టు 8: పట్టణం స్వర్ణకార సంఘ నూతన కార్యవర్గం శుక్రవారం ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు బాజోజీ శ్రీనివాస్, తునికి సుదీర్, తునికి వేణు, మండలోజుల రామచంద్రం, మండలోజు నరేందర్‌లు తెలిపారు. అధ్యక్షుడిగా ఇందూరిప్రసాద్ కుమార్, ప్రధాన కార్య దర్శిగా శ్రీరాముల ప్రశాంత్‌లు గెలిచినట్లు తెలిపారు.